నాడు ఏడి నేడు ముర్రి పింఛన్

- తెల్లవారకముందే లబ్ధిదారుల చేతిలో నగదు
- తలుపు తట్టి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్లు
- లబ్ధిదారులకు తప్పిన తిప్పలు



వృద్ధురాలు సుజాతకు పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి (ఫైల్)

గోనెగండ్ల: ఒంటరి జీవనం, వృద్ధాప్యంలో బతుకు ఆగమ్యం, వైకల్యంతో కష్టం, వితంతువులకు కానరాని గమ్యం, ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో వ్యథ. ఏం తినాలి. ఎలా బతకాలి. ఎక్కడ ఉండాలి. అనేవన్నీ ప్రశ్నలే.. ఈ కష్టాలన్నీ చెరిపేస్తూ నూతన శకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాంది పలికారు. పెద్ద కొడుకులా నిస్సహాయుల జీవితాల్లో ఆనందం నింపారు. అర్హులందరికీ పింఛన్లు అందిస్తూ బడుగుల జీవితాలకు భరోసా తెచ్చారు. ప్రతినెలా ఒకటో తేదీ వేకువజామునే వలంటీర్ల ద్వారా వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత కార్మికులు, అభయహస్తం, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకార, చర్మకారులు, డప్పు కళాకారులకు వైఎస్సార్ పింఛను కానుక సొమ్ము అందిస్తూ ప్రతి కుటుంబానికి వెలుగునిచ్చారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2,750 పింఛను అందిస్తోంది. త్వరలోనే ఆ సొమ్ము రూ.3 వేలకు పెంచనుంది. వృద్ధులు, వితంతువులకు రూ.2,750, దివ్యాంగులకు రూ.3 వేలు, కిడ్నీ రోగులకు రూ.10 వేలు, పక్షవాత రోగులకు రూ.5 వేల చొప్పున పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. నెలలో మొదటి రోజునే లబ్ధిదారులకు సొమ్ము అందిస్తుండడం విశేషం. తెల్లవారక ముందే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి పింఛన్ సొమ్ము చేతిలో పెడుతున్నారు. ఈ సొమ్ము తమకు ఆసరాగా నిలుస్తుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాడు పడిగాపులు.. ప్రయాసలు

గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ పడిగాపులు కాయాల్సి వచ్చేది. అది కూడా ఎప్పుడు ఇస్తారో తెలియదు. చివరికి రాత్రికి ఇంటికి వచ్చేవారు. ఒక్కోరోజు సర్వర్ పనిచేయకపోవడంతో పంపిణీ నిలిపివేసేవారు. కొంతమంది రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఎన్నికల ముందు పాదయాత్రలో లబ్ధిదారుల కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమూల మార్పులు తీసుకొచ్చారు. ప్రతిష్టాత్మకంగా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛను సొమ్ము అందిస్తున్నారు. ప్రజల దీవెనలు అందుకుంటున్నారు. అలాగే కొత్త పింఛన్ల నమోదు ప్రక్రియ నిరంతరం చేశారు. ఎప్పటికప్పుడు కొత్త అర్హులతో వలంటీర్లు దరఖాస్తు చేయిస్తున్నారు. వీటిని పరిశీలించి అధికారులు పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి(జనవరి, జూన్) కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు.

నియోజకవర్గంలో పింఛన్ వివరాలు

మండలం	పింఛన్లు	నగదు
గోనెగండ్ల	8,953	రూ.2.48 కోట్లు
నందవరం	6,963	రూ.1.91 కోట్లు
ఎమ్మిగనూరు	8,663	రూ.2.40 కోట్లు

ఇంటి వద్దకే పింఛను



నాకు ప్రతినెలా 1వతేదీన వితంతు పింఛన్ అందుతుంది. తెల్లవారక ముందే వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము రూ.2,750 అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది. జగనన్న అందిస్తున్న పింఛన్ మా లాంటి వారిని అదుకుంటోంది.

– నరసమ్మ, గోనెగండ్ల, లబ్ధిదారురాలు

పడిగాపులు పోయాయి



నా పేరు కురువ రంగస్వామి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పెద్ద అన్నలా ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్ అందిస్తున్నారు. ఈ సొమ్ము మా కుటుంబానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. గ్రామ వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే నరకం చూసేవాడిని. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్ల కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎండలో పడిగాపులు కాయాల్సిన బాధలు తప్పాయి.

– కురువ రంగస్వామి, దివ్యాంగుడు, జొహరాపురం గ్రామం, నందవరం మండలం

అర్హులందరికీ పింఛన్లు



మండలంలో అర్హత కలిగి వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నాం. ప్రతి నెలా చివరి రోజున వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. మరుసటి రోజు (1వ తేదీ) పింఛన్ పంపిణీకి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ పంచాయతీ అధికారులందరూ వలంటీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్నారు.

– నాగేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, గోనెగండ్ల

'జగనన్న సురక్ష' షెడ్యూల్ ఖరారు

ఆలూరు రూరల్: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు, సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు అవసరమైన తొమ్మిది రకాల ధ్రువపత్రాలు అందించేందుకు ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్ ఖరారు చేసినట్లు ఎంపీడీఓ అల్లబకాష్ సోమవారం తెలిపారు. మండల తహసీల్దార్ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఒక బృందం, ఎంపీడీఓ అల్లబకాష్ నేతృత్వంలో మరో బృందం 17 సచివాలయాల్లో జూన్ 1వ తేదీ నుంచి పర్యటిస్తుందని చెప్పారు. జూన్ 1న ఆలూరు సచివాలయం–1, 2, 4వ తేదీన సచివాలయం–3, 4, 5వ తేదీన హత్తిబెళగల్, కురువళ్లి సచివాలయాలు, 7వ తేదీన మొలగవల్లి–1, 3 సచివాలయాలు, 11వ తేదీ నుంచి మొలగవల్లి–2, కురుకుంద గ్రామ సచివాలయం, 13వ తేదీ అరికెర, మనేకుర్తి, 18న మరకట్టు, హులేబీడు, 20న కమ్మరచేడు, పెద్దహోతూరు, 25న మూసానహళ్లి గ్రామ సచివాలయం పరిధిలో అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోనున్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నియంత్రణ

మద్దికెర: ఖరీఫ్‌లో సాగు చేసే వేరుశనగ విత్తనాలను శుద్ధి చేయడం వల్ల పంటకు తెగుళ్లు సోకకుండా నియంత్రించవచ్చని ఏఓ రవి అన్నారు. సోమవారం రైతుల సమావేశంలో విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక కిలో విత్తనాలకు ఇమిడాక్లోప్రిడ్ 2 ఎంఎల్ కలిపి విత్తనశుద్ధి చేయడం వల్ల రసం పీల్చే పురుగుల నుంచి రక్షించుకోవచ్చన్నారు. అలాగే వేరుపురుగు ఆశించకుండా క్లోరిపైరిఫాస్ 6 ఎంఎల్, భూమి ద్వారా వచ్చే తెగుళ్లను అరికట్టడానికి ఫ్లాక్సాపెరాక్సైడ్ 1 ఎంఎల్, జీవశిలీంద్రనాశకాలైన ట్రైకోడెర్మావిరిడి 6 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందన్నారు. రైతులు పంటలసాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

క్లుప్తంగా

పంటల సాగుకు సహకరించాలి

ఆస్పరి: తమకు మంజూరుచేసిన ప్రభుత్వ భూముల్లో పంటలు సాగు చేసుకునేందుకు సహకరించాలని ఆస్పరికి చెందిన మూలింటి శేఖర్ సోమవారం స్పందనలో తహసీల్దార్ కుమారస్వామికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. 2006లో ముత్తుకూరులో సర్వే నంబర్–4లో ప్రభుత్వ భూమిని 13 మందికి అప్పటి ప్రభుత్వం పట్టాలిచ్చిందన్నారు. ఆ భూములను సర్వే చేసి సాగు చేసుకునేందుకు సహకారం అందించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యాలయాల తరలింపు

మద్దికెర: పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ఆధార్ కేంద్రం, సచివాలయం–1ను ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న నూతన భవనంలోకి మార్చినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి సోమవారం తెలిపారు.

సచివాలయంలో భూ రిజిస్ట్రేషన్


రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న పీఎస్ బాలరాజు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల–3 సచివాలయం పరిధిలోని సహకార బ్యాంక్ నుంచి మార్టిగేజ్ రద్దు రిజిస్ట్రేషన్ జరిగినట్లు పంచాయతీ కార్యదర్శి బాలరాజు సోమవారం వెల్లడించారు. రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన మాబువలి కడిమెట్ల సహకార సొసైటీకి తన భూమిని మార్టిగేజ్ చేయించి రుణం తీసుకున్నాడు. ప్రస్తుతం రుణం తిరిగి చెల్లించడంతో సొసైటీ బ్యాంకు నుంచి మార్టిగేజ్ రద్దు చేయించి కడిమెట్ల–3 సచివాలయంలో భూమిని యజమాని పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు చెప్పారు. ఇక నుంచి గ్రామ సచివాలయాల్లో భూ రిజిస్ట్రేషన్లు జరుగుతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

వివాహిత ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామంలో జ్యోతి (26) అనే వివాహిత మహిళ సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన వీఆర్వో రవి తెలంగాణ ప్రాంతానికి చెందిన జ్యోతిని మూడేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి బాబు, పాప సంతానం. ప్రస్తుతం రవి నందవరం మండలం కనకవీడు వీఆర్వోగా పనిచేస్తున్నాడు. భర్త డ్యూటీకి వెళ్లాక జ్యోతి ఇద్దరు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై రూరల్ ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డిని సంప్రదించగా వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం వచ్చిందని విచారణ చేపట్టామన్నారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ మహబూబ్‌బాష తెలిపారు. బీఏ, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ జువాలజీ కోర్సులకు అర్హులైన విద్యార్థులు ఓఏఎండీసీ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 24వ తేదీలోపు దరకాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాలలో నేరుగా లేదా 98858 86774, 94905 41487 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటివద్దకే వైద్యసేవలు

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో తెచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం రోగులకు, పేదలకు వరం అని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి అన్నారు. సోమవారం స్థానిక సచివాలయం–3 పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం సిబ్బందితో కలిసి దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతల ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహించారు. సోమవారం 68 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

పెరటి కోళ్లు మంజూరు

మద్దికెర: మండలానికి 200 పెరటికోళ్ల యూనిట్లు మంజూరైనట్లు వైకేపీ ఏపీఎం మధుబాబు సోమవారం తెలిపారు. లబ్ధిదారులు యూనిట్‌కు రూ.3,250 చెల్లించాలని, ఒక యూనిట్‌లో 8 పెట్టలు, 3 పుంజులతో పాటు మెడికల్ కిట్ ఉంటుందని తెలిపారు. కోళ్లు వచ్చిన వెంటనే పొదుపు గ్రూపులకు పంపిణీ చేస్తామన్నారు.

23న కేంద్ర మంత్రి రాక

ఎమ్మిగనూరురూరల్: ఈ నెల 23వ తేదీ కేంద్ర మంత్రి దేవ్‌సిన్హాచౌహాన్, బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవ్‌ధర్‌లు ఎమ్మిగనూరుకు వస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఆర్.మురహరరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఎమ్మిగనూరులో బహిరంగ సభ నిర్వహించనున్నామని, వివరాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

కృష్ణగిరి: గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. కృష్ణగిరిలోని రామకృష్ణాపురం వెళ్లే ప్రధాన రహదారిలో నిర్మించిన డ్రైనేజీని సోమవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరితో కలిసి పరిశీలించారు.మండల కో–ఆప్షన్ మెంబర్ షేక్ షాలుమియ్యా తదితరులు వెంట ఉన్నారు.

సారా విక్రేతల అరెస్ట్

వెల్దుర్తి: బోయనపల్లెకు చెందిన సారా విక్రేతలు రామచంద్రుడు, రామాంజనేయులును సోమవారం అరెస్ట్ చేసినట్లు కోడుమూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. తాము, వెల్దుర్తి పోలీసులు జరిపిన సోదాల్లో నిందితుల వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

భజన పోటీల విజేత కడిమెట్ల

ఆస్పరి: ములుగుందంలో శ్రీశైలం తాత ఆరాధనోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి భజన పోటీల్లో కడిమెట్ల బృందం విజేతగా నిలిచి అర తులం బంగారం గెలుచుకుంది. సోమవారం విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. పోటీల్లో 23 భజన బృందాలు పాల్గొన్నాయి. తర్వాతి స్థానాల్లో వరుసగా బైలుప్పల, శంకరాపురం, తురువగల్లు, హలిగేర, దొడగొండ, వెంకటాంపల్లె, ధర్మల్, ఐనకల్లు, హెచ్.కైరవాడి(ఎర్రకోట), పామిడి, విరుపాపురం, పుప్పాలదొడ్డి, గుండ్లమల్లాపురం, లక్ష్మంపల్లి, గుత్తి ఆర్ఎస్, కే.నాగలాపురం, డీ.కోటకొండ భజన బృందాలు నిలవగా 25 తులాల వెండి, 22, 20, 19, 18, 15, 11, 10, 9, 8, 6, 5, 5, 4, 4, 3, 2 తులాల వెండి, 19వ బహుమతి దోసలుడికి బృందానికి గోడగడియారం అందించారు.

23న ఆదోనిలో జాబ్‌మేళా

హొళగుంద: ఈ నెల 23న ఆదోనిలో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీప్ సంస్థ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు కట్టా భాస్కర్ ప్రతాప్ సోమవారం తెలిపారు. వివరాలకు 93984 07427, 89195 98468 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

నందవరం: ప్రతి ఇంటికీశుద్ధ జలం అందిస్తామని జేజేఎం జిల్లా సమన్వయకర్త లక్ష్మినారాయణ అన్నారు. సోమవారం ఏపీఎం చిన్నవీరన్న ఆధ్వర్యంలో గ్రామీణ నీటి సరఫరాపై మహిళా సమైక్య సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పల్లెల్లో తాగునీటి ఎద్దడి నివారణ, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు చేపట్టిన చర్యలను వివరించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


ఎమ్మిగనూరు 30వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నాలుగేళ్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ప్రజా సంక్షేమమే లక్ష్యంగా దూసుకెళుతోందని, ప్రతి కుటుంబం సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 30వ వార్డు ఎంఎస్ నగర్‌లో వార్డు ఇన్‌చార్జ్ కె.విశ్వనాథ్, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు ఇచ్చి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. మున్సిపల్ డీఈ మనోహర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, యూకే రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, నజీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సమావేశం


ఆలూరు రూరల్: అర్హత ఉండి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తామని ఆలూరు విద్యుత్ డిప్యూటీ డివిజినల్ ఇంజినీర్ నాగేంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం ఆలూరు మండల విద్యుత్ కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఉంటే రైతులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో అపోహలు వీడాలని చెప్పారు. సీనియారిటీ ప్రకారం రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తామన్నారు. ఏఓ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. బోర్ల కింద పంటలు సాగు చేసే రైతులు మంచి విత్తనాలను ఎంపిక చేసుకోవడంతో పాటు భూసార పరీక్షలు చేయించుకుని అధికారుల సలహాలు, సూచనల మేరకు పంటలు సాగు చేసుకోవాలన్నారు. విద్యుత్ ఏఈ లోకేష్, రైతులు హాజరయ్యారు.


సంక్షేమ పథకాలతో పేదలందరికీ లబ్ధి



రాంపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం రాంపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. నాలుగేళ్లలో ఏఏ పథకం ద్వారా ఎంత లబ్ధి పొందారో కరపత్రాల ద్వారా వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పక్కా గృహాలు మంజూరు చేయాలని, సీసీ రోడ్లు వేయాలని, తాగునీటి సమస్య తీర్చాలని, మిద్దెలపై వెళ్లిన విద్యుత్తు లైన్ మార్చాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, రామచంద్రారెడ్డి, నాగభూషణరెడ్డి, వెంకటరాముడు, సర్పంచ్ మనీంద్ర, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఎంఈఓ–2ల బాధ్యతల స్వీకరణ


ఎం.రమేశ్ వెల్దుర్తి


కె.జగన్నాథ్ హొళగుంద


మధుసూదన్‌రాజు ఎమ్మిగనూరు

గోనెగండ్ల: మండలం రెండవ విద్యాధికారిగా ఎం.నీలకంఠ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎమ్మిగనూరు మండలం కొటేకల్ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేశారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

వెల్దుర్తి: ఎంఈఓ–2గా ఎం.రమేశ్ సోమవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో బాధ్యతలు స్వీకరించారు. కలుగొట్ల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా ఉన్న ఆయన వారం రోజుల క్రితం అమడగుంట్ల పాఠశాలకు బదిలీపై వెళ్లి పదోన్నతిపై వెల్దుర్తి ఎంఈఓ–2గా నియమించబడ్డారు.

తుగ్గలి: మండల విద్యాశాఖ అధికారి–2గా రామ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈయన పూడూరు హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. తుగ్గలి ఇన్‌చార్జ్ ఎంఈఓగా గత ఎనిమిదేళ్లుగా పని చేస్తున్నారు.

హొళగుంద: స్థానిక ఎంఈఓ–2గా కె.జగన్నాథ్ బాధ్యతలు చేపట్టారు. ఆస్పరి మండలం చిన్నహోతూరు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా ఉన్న ఈయన్ను జిల్లా ఉన్నతాధికారులు హొళగుంద ఎంఈఓ–2గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కృష్ణగిరి: మండల ఎంఈఓ–2గా ఎస్.మద్దయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బేతంచర్లలోని హనుమాన్‌నగర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడి వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎస్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మధుసుదన్‌రాజు ఎమ్మిగనూరు ఎంఈఓ–2గా పదోన్నతిపై నియమితులయ్యారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగు


ఎమ్మెల్యే చేతులమీదుగా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

పత్తికొండటౌన్: విద్యతోనే పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందని బలంగా నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం పత్తికొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ప్రశంసాపత్రం, మొమెంటోతో పాటు మొదటి మూడు స్థానాలకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున చెక్కులు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు జి.ఉరుకుందమ్మ, ఎంపీపీ ఎం.నారాయణదాసు, పత్తికొండ సర్పంచ్ కొమ్ము దీపిక, నాయకులు సోమశేఖర్, నీలకంఠ, టీఎండీ హుసేన్, రహిమాన్, శ్రీరాములు, శ్రీరంగడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన విద్యార్థులు (పదో తరగతి)

1. చిన్న గొల్ల ప్రభాకర్ – 573 మార్కులు– ఏపీఆర్ బాలుర గురుకుల పాఠశాల, పత్తికొండ
2. కె.నవీన – 572 మార్కులు, ఏపీ మోడల్ స్కూల్, పత్తికొండ.
3. ఎం.నవీన్‌కుమార్–570 మార్కులు, ఏపీఆర్ బాలుర గురుకుల పాఠశాల, పత్తికొండ

ఇంటర్మీడియెట్

1. బి.శివప్రసాద్– ఎంఈసీ – 914 మార్కులు–ఏపీఆర్ గురుకుల కళాశాల, పత్తికొండ
2. బి.పూజిత– బైపీసీ – 968 మార్కులు– డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, పత్తికొండ
3. వై.ఐశ్వర్య– హెచ్ఈసీ గ్రూపు– 854 మార్కులు–ఏపీఆర్‌డబ్ల్యూఎస్ బాలికల కళాశాల, కంబాలపాడు
4. ఎం.శృతి– ఎంపీసీ గ్రూపు–936 మార్కులు–ఏపీఆర్‌డబ్ల్యూఎస్ బాలికల కళాశాల, కంబాలపాడు

నందవరం: ముగతి గ్రామంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, పీఎస్ఎంసీ చైర్మన్ వీరేష్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఎంబీ.గోవిందు 563 మార్కులతో రూ.3 వేలు, షేక్ మహబూబ్ 528 మార్కులతో రూ.2 వేలు, జి.పార్వతి 528 మార్కులతో రూ.వెయ్యి నగదు బహుమతులు అందుకున్నారు. అలాగే నాగలదిన్నె జెడ్పీ పాఠశాలలో జె.శేఖర్ రూ.3 వేలు, బి.కల్యాణరాం రూ.2 వేలు, ఎం.ఎస్ ఫహీమ్‌బాషా రూ.వెయ్యి నగదుతో పాటు షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలు పొందారు.

ఆలూరు రూరల్: స్థానిక జెడ్పీ ఉర్దూ హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఖమ్రున్నీసాకు రూ.3 వేలు, అప్సానాకు రూ.2 వేలు, గౌసియాకు రూ.వెయ్యి నగదు బహుమతులను పీఎంసీ కమిటీ చైర్మన్ ఎస్ఎస్.బాషా, హెచ్ఎం సావిత్రమ్మ అందజేశారు

ఆలూరు: స్థానిక సమీకృత వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదివిన మల్లికార్జున, ఉపేంద్ర కుమార్, సందీప్‌కుమార్ టాపర్లుగా నిలిచి నగదు బహుమతులుఅందుకోవడంతో వారినిహెచ్‌డబ్ల్యూఓ మహ్మద్ అలీ ప్రత్యేకంగా అభినందించారు.

కృష్ణగిరి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఉదయ్, రాహుల్, చాందినిలను ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, ఎంఈఓ విజయభాస్కర్, హెచ్ఎం కల్పన సత్కరించి బహుమతులు అందించారు.

హొళగుంద: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి టాపర్లుగా నిలిచిన విద్యార్థులు శ్రావణి తిప్పేస్వామి (569 మార్కులు), కె.లావణ్య (547), ఆది బసవ (546)లను హెచ్ఎం నజీర్ అహ్మద్, పీఎంసీ చైర్మన్ మజ్జిగ సిద్ధయ్య నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రశంస పత్రాలు, మెడల్స్ అందించి సత్కరించారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ మృతి


చెన్నకేశవులు (ఫైల్)

గోనెగండ్ల: మండల విద్యాశాఖ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న చెన్నకేశవులు (55) కోలుకోలేక సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. గతవారం చెన్నకేశవులు గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంఈఓ వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు గోనెగండ్లలోని చెన్నకేశవులు ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ఎంఈఓ రూ.10 వేలు, సర్వశిక్ష అభియాన్ తరపున రూ.15 వేలు మృతుడి భార్య శ్యామలకు అందజేశారు.

స్పందనలో అర్జీల స్వీకరణ

తుగ్గలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తహ సీల్దార్ రవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మద్దికెర మండలం మదనంతపురానికి చెందిన నాగమ్మ పట్టాదారు పాసు పుస్తకంలో సర్వే నంబరు తప్పుగా పడిందని అర్జీ ఇచ్చింది. పలువురు రైతు లు మీసేవలో వన్‌బీలు రావడం లేదని లాక్ పడ్డా యని వాటిని తొలగించాలని అర్జీలు ఇచ్చారు. ఎంపీడీఓ సావిత్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమంపై దృష్టి సారిస్తాం

మద్దికెర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై దృష్టి సారించి ప్రజలకు చేరువయ్యేలా చూస్తామని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధరరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జెడ్పీటీసీలకు ప్రభుత్వం శ్రీకాళహస్తిలో మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించిదని.. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో జెడ్పీ టీసీల భాగస్వామ్యంపై ట్రైనర్లు వివరించారన్నా రు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు.

ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

మద్దికెర: 2 – 5 సంవత్సరాల పిల్లలను బడిలో చేర్చుకుంటున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి పద్మజ రాజేశ్వరి కోరారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ కొన్ని స్కూళ్లు ఇష్టానుసారంగా పిల్లల అడ్మిషన్లు చేసుకుంటున్నాయని, దీంతో అంగన్‌వాడీలలో కేంద్రాల్లో పిల్లల సంఖ్య పడిపోతుందన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: అనుమతి లేకుండా షిఫ్టింగ్, తరగతులు నిర్వహిస్తున్న దీక్ష జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్రబాబు, విజయేంద్ర డిమాండ్ చేశారు.స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో నిరసన చేపట్టి కళాశాలపై చర్యలు తీసుకోవడంలో విఫలమైన ఆర్ఐఓ దిష్టి బొమ్మను దహనం చేశారు.

వాడీవేడిగా గ్రామసభ

వెల్దుర్తి: కొనసాగుతున్న సోషల్ ఆడిట్‌లో భాగంగా ఉపాధి సిబ్బంది, కూలీలు, సర్పంచ్ వర్గీయుల వాదులాట మధ్య రామళ్లకోటలో గ్రామసభ సోమవారం వాడివేడిగా సాగింది. ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఏపీఓ రాజునాయక్, సీఆర్పీ, డీఆర్పీల ఆధ్వర్యంలో దాదాపు రూ.2 కోట్ల ఉపాధి పనులకు సంబంధించి జరిగిన గ్రామసభలో.. పనులు చేయలేదన్న ఒకరి వాదనకు, తాము పనులు చేశామని కూలీలు ముందుకు వచ్చారు. పని చేయకుండా కొందరు వేతనాలందుకున్నారన్న మాటలపై వాదులాట జరిగింది. స్థానిక పోలీసులు ఘటనాస్థలికి చేరుకోవడంతో వాదన సద్దుమనిగింది. ఈ దశలో సోషల్ ఆడిట్ సిబ్బందికి ఎఫ్ఏపై సర్పంచ్ వర్గీయులు ఫిర్యాదు చేశారు. గోవర్ధనగిరిలో దాదాపు రూ.2.64 కోట్ల పనులకు సంబంధించి కొనసాగిన గ్రామసభలో సర్పంచ్ వర్గీయులు మాట్లాడుతూ ఎఫ్ఏలు సరైన పనులు చేపట్టాలని సోషల్ ఆడిట్ సిబ్బందిని కోరారు.

రోడ్డు నిర్మాణంపై దృష్టి


ఆదోని రోడ్డులో పనులను పర్యవేక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: రోడ్డు సమస్యపై మంత్రి గుమ్మనూరు జయరాం ప్రత్యేక దృష్టి సారించారని, ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నారని ఆయన సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి అన్నారు. సోమవారం వారు ధణాపురం–హొళగుంద రోడ్డులో తాత్కాలిక మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ మార్గంలో దాదాపు 25 కి.మీ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.59 కోట్లు నిధులు మంజూరుకాగా పనులు ప్రారంభమై నిలిచిపోయాయి. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆదోని ఆర్టీసీ అధికారులు బస్సులను వేరే మార్గంలో తిప్పుతున్నారు. మండల ప్రజలు సమస్యపై స్పందించిన మంత్రి గుమ్మనూరు జయరాం సొంత ఖర్చుతో భారీ వాహనాలు, ట్రాక్టర్లు పెట్టి గ్రావెల్‌తో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. సోమవారం పనులను మంత్రి సోదరులు పరిశీలించారు. త్వరలోనే రోడ్డు నిర్మాణానికి మంత్రి చర్యలు తీసుకుంటారని, అలాగే మార్లమడికి రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తారన్నారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

చిప్పగిరి: మండలంలోని బంటణాహాలు రైల్వే స్టేషన్ నుంచి ఏరూరు గ్రామం వరకు 6 కి.మీ మేర చేపట్టిన గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులను ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ సోమవారం పరిశీలించారు. గ్రావెల్ రోడ్డుతో రెండు గ్రామాల మధ్య 15 కి.మీ దూరం తగ్గనుంది.